
MRR 69 TV

అవినీతిపై అక్షర సమరం

మన అంకుశం

సంచలన సాయంకాలం దినపత్రిక




ఎడిటర్ : మచ్చా రామలింగారెడ్డి | సంపుటి : 2 | సంచిక : 234 | బుధవారం 14 మే 2025 | పేజీలు : 4 | వెల : 3/-





# నేనెప్పుడూ నిత్య విద్యార్థినే!



- ఎప్పటికప్పుడు కొత్త విషయాలు నేర్చుకుంటా
- కోడిగుడ్ల ఉత్పత్తిలో ఏపీ అగ్రస్థానం
- మాంసం ఉత్పత్తిలో 5, పాల ఉత్పత్తిలో 7వ స్థానం
- గ్రామాల్లో డెయిరీ షెడ్లకు ప్రాపర్టీ టాక్స్ రద్దు చేస్తాం
- కులవృత్తుల వారికి ప్రభుత్వం నుంచి ప్రోత్సాహకాలు

**పశు సంవర్థక శాఖ టెక్ ఏఐ 2.0 కాన్క్లేవ్‌లో సీఎం చంద్రబాబు**



**(అంకుశం, అమరావతి, మే 14):**

పాడి పరిశ్రమ ద్వారా పేదల జీవితాల్లో మార్పు వస్తుందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. వ్యవసాయం, అనుబంధ రంగాల్లో ఏపీ నెంబర్ వన్‌గా ఉందని, టీడీపీ అధికారంలో ఉన్నప్పుడల్లా వ్యవసాయ రంగానికి అధిక ప్రాధాన్యత ఇచ్చిందన్నారు. విజయవాడలో బుధవారం హెూటల్ మురళీ ఫార్చ్యూన్‌లో జరిగిన పశు సంవర్థక శాఖ %-% టెక్ ఏఐ 2.0 కాన్క్లేవ్‌లో సీఎం పాల్గొన్నారు. లైవ్ స్టాక్ రంగాన్ని అభివద్ధి చేయడం ద్వారా పేదరికాన్ని తగ్గించాలనే లక్ష్యంతో జీఎఫ్ఎస్‌టీ(గ్లోబల్ ఫోరమ్ ఫర్ సస్టయినబుల్ ట్రాన్స్ ఫర్మేషన్) సంస్థ ఈ వర్క్ షాపు ఏర్పాటు చేయడం చాలా సంతోషకరమని, ఇటువంటి సమావేశాలకు హాజరవుతూ కొత్త విషయాలను అందరూ నేర్చుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు వివిధ వత్తుల వారితో ముచ్చటించారు. వారి ఆదాయ, వ్యయాలపై చర్చించారు. సుమారు మూడు గంటలకు పైగా సీఎం సమావేశంలో పాల్గొన్నారు. భారతదేశం ప్రపంచంలోనే పాల ఉత్పత్తిలో అగ్రగామి కాగా మన రాష్ట్రం అందులో వేగంగా పురోగతి సాధిస్తుండటం శుభ పరిణామం. గుడ్ల ఉత్పత్తిలో మొదటి స్థానం, మాంసం ఉత్పత్తిలో 5వ స్థానం, పాల ఉత్పత్తిలో 7వ స్థానంలో మన రాష్ట్రం ఉంది. లైవ్ స్టాక్‌లో 2014%-%15లో ఎ ఙ్కు రూ.43,127 కోట్లు ఉండగా....2018%-%2019 నాటికి దానిని రూ.91,633 కోట్లకు పెంచాం. 2014%-%19 మధ్య ఇఅఎఖ21 శాతం ఉండగా2019%-%24 మధ్య ఈ వద్ది 11 శాతానికి తగ్గింది. 2024%-%25లో రూ.1.69 లక్షల కోట్ల ఆదాయాన్ని ఆర్జించింది. రాష్ట్ర ఎ ఙ్కులో ఇది 11.23 శాతం. 2025%-%26 సంవత్సరానికి ఈ రంగంలో జీఎస్డీపీ వద్ది లక్ష్యం రూ.1,95,460 కోట్లుగా పెట్టుకున్నాం. ఆంధ్రప్రదేశ్ వ్యవసాయంలో నెంబర్ వన్ రాష్ట్రంగా ఉంది. - మిగతా2లో

## పండుగ వాతావరణంలో తెదేపా మహానాడు

- ఏర్పాట్లపై మంత్రి లోకేశ్ సమీక్ష
- "ఏటా మహానాడును పండుగ వాతావరణంలో నిర్వహిస్తున్నాం
- పార్టీ కష్టకాలంలో ఉన్నా, అధికారంలో ఉన్నా మహానాడును నిర్వహించాం
- గత ప్రభుత్వంలో మహానాడుకు అడుగడుగునా ఇబ్బందులు పెట్టారు
- అయినా ప్రజలు స్వచ్ఛందంగా తరలివచ్చి విజయవంతం చేశారు.



**అంకుశం ప్రత్యేక ప్రతినిధి** మంగళగిరి

తెలుగుదేశం పార్టీ మహానాడుకు ఏర్పాట్లు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. మహానాడును మే 27 నుంచి 29 వరకు కడపలో పండుగ వాతావరణంలో నిర్వహించనున్నట్లు మంత్రి, తెదేపా జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ తెలిపారు. మహానాడు ఏర్పాట్లపై పొలిట్ బ్యూరో సమావేశానికి ముందు ఆయన మంగళగిరిలోని పార్టీ జాతీయ కార్యాలయంలో మహానాడు కమిటీల కన్వీనర్లు, కో కన్వీనర్లతో సమావేశమయ్యారు. మహానాడు ఏర్పాట్ల గురించి నేతలతో సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా పలువురు మంత్రులు, సీనియర్ నేతలకు బాధ్యతలు అప్పగించారు. పొలిట్ బ్యూరో సమావేశంలో మహానాడు ఏర్పాట్లపై మంత్రి నారా లోకేష్ ఆధ్వర్యంలోని మంత్రుల కమిటీ నివేదిక ఇవ్వనుంది. ఈ సందర్భంగా మంత్రి లోకేశ్ మాట్లాడుతూ.. "ఏటా మహానాడును పండుగ వాతావరణంలో నిర్వహిస్తున్నాం. పార్టీ కష్టకాలంలో ఉన్నా, అధికారంలో ఉన్నా మహానాడును నిర్వహించాం. గత ప్రభుత్వంలో మహానాడుకు అడుగడుగునా ఇబ్బందులు పెట్టారు. అయినా ప్రజలు స్వచ్ఛందంగా తరలివచ్చి విజయవంతం చేశారు. పార్టీ ఆవిర్భావం తర్వాత చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా తిరుగులేని మెజార్టీ సాధించాం. మహానాడుకు వచ్చే కార్యకర్తలకు వసతి, - మిగతా3లో

## చెరువుల్లో మునిగి 8 మంది మృతి

**అంకుశం ప్రత్యేక ప్రతినిధి భీమడోలు**

కడప, ఏలూరు జిల్లాల్లో చెరువుల్లో మునిగి బుధవారం 8 మంది చిన్నారులు మృతి చెందారు. కడప జిల్లా బ్రహ్మంగారిమఠం మండలంలోని మల్లెపల్లె చెరువులో ఈతకు వెళ్లి ఐదుగురు చిన్నారులు నీటిలో మునిగిపోయారు. వేసవి సెలవులకు బంధువుల ఇంటికి వచ్చిన సందర్భంలో ఈ దుర్ఘటన జరిగింది. కడప జిల్లాలో 5 గురు చిన్నారుల మృతిపై మంత్రి బీసీ జనార్థన్‌రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. చిన్నారుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. అదేవిధంగా ఏలూరు జిల్లా భీమడోలు మండలంలో విషాదం చోటు చేసుకుంది. బుధవారం మధ్యాహ్నం కోమటిగుంట చెరువులో మునిగి ముగ్గురు మతి చెందారు. భీమడోలు మండలంలోని పెదలింగంపాడులో వేడుకకు హాజరైన నలుగురు తిరుగు ప్రయాణంలో కాలకత్యాల కోసం కోమటిగుంట - మిగతా3లో





## రేపు అనంతలో చంద్రమోహన్ మెమోరియల్ క్రికెట్ టోర్నీ ఫైనల్స్

- ఫైనల్స్ కు చేరిన అనంత రైజింగ్ స్టార్స్, కదిరి జట్లు
- మచ్చు దత్త రెడ్డి 3 వికెట్లతో అద్భుతమైన బౌలింగ్
- గిరినాథ్ రెడ్డి (67) అర్ధ సెంచరీ






**అంకుశం స్పోర్ట్స్ అనంతపురం మే 14:**

అనంతపురం జిల్లా క్రికెట్‌అసోసియేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్నచంద్రమోహన్ మెమోరియల్ ట్రోఫీ 2025 ఫైనల్స్ కు చేరిన అనంత రైజింగ్ స్టార్స్, కదిరి జట్లు అనంతపురం జిల్లా క్రికెట్ అసోసియేషన్, ఆర్డీటీ సంయుక్తంగా నిర్వహిస్తున్న చంద్రమోహన్ మెమోరియల్ టీ20 లీగ్ సెమీఫైనల్ ఆర్డిటి క్రీడా - మిగతా2లో



మన అంకుశం
సాయంకాలం దినపత్రిక
బుధవారం 14 మే 2025

# రేపు అనంతలో చంద్రమోహన్ మెమోరియల్ క్రికెట్ టోర్నీ ఫైనల్స్

-మొదటిపేజీ తరువాయి

మైదానంలో బుధవారం ఉదయం మొదటి సెమీఫైనల్లో కదిరి, అనంతపురం జిఎస్టీ జట్లు తలపడ్డాయి టాస్ గెలిచి ఫీల్డింగ్ ఎంచుకున్న అనంతపురం జిఎస్టీ కదిరి జట్టును బ్యాటింగ్ కు ఆహ్వానించిది నిర్ణిత 20 ఓవర్లలో 191/7 పరుగులకు చేశారు గిరినాథ్ రెడ్డి 67, వెంకట్ సాయి 48, మొహమ్మద్ సోను 29 పరుగులు తీశారు అనంతపురం జిఎస్టీ బౌలర్లు శ్యామ్ 3, ప్రవీణ్, బాబ్ జాన్, రెడ్డి ఒక్కో వికెట్ తీసుకున్నారు. అనంతరం బ్యాటింగ్ కు వచ్చిన అనంతపురం జిఎస్టీ జట్టు 20 ఓవర్లలో 144/5 పరుగులు మాత్రమే చేసి 47 పరుగుల తేడాతో ఓటమి చవిచూసింది. అనంతపురం జిఎస్టీ బ్యాటర్లు హిమాతేజ్ 34, విజయకుమార్ 31, శ్యామ్ 31, జై 25 పరుగులు తీశారు. కదిరి బౌలర్లు భాను ప్రకాష్ 2, ప్రణీత్, అరవింద్, తేజ ఒక్కో వికెట్ తీసుకున్నారు.

మధ్యాహ్నం జరిగిన రెండవ సెమీఫైనల్స్ మ్యాచ్ లో అనంత రైజింగ్ స్టార్స్, ఫ్యామిలీ క్లబ్ జట్లు తలబడ్డాయి టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న అనంతపురం రైజింగ్ స్టార్స్ నిర్ణిత 20 ఓవర్లలో 153/9 పరుగులు తీశారు ప్రశాంత్ 37, లోహిత్ 22, ప్రదీప్ 19 పరుగులు తీశారు ఫ్యామిలీ క్లబ్ బౌలర్లు నవదీప్ 2, యోగానంద 2, రామాంజనేయులు 2, సంజయ్, వెంకట్ చెరో ఒక వికెట్ తీసుకున్నారు. ఫ్యామిలీ క్లబ్ 154 పరుగుల లక్ష్యాన్ని చేధించడంలో చితికలపడింది 18.5 ఓవర్లలో 121 పరుగులకు ఆలౌట్ అయింది అనంత రైజింగ్ స్టార్స్ జట్టు 32 పరుగులతో విజయం సాధించి ఫైనల్స్ కు చేరుకుంది ఫ్యామిలీ క్లబ్ బ్యాటర్లు వీరారెడ్డి 48, వెంకట్ 20, యోగనంద 15, పరుగులు తీశారు. అనంత రైజింగ్ స్టార్స్ బౌలర్లు దత్తా రెడ్డి 3, భార్గవ్ 2, లోహిత్, హర్ష, ప్రదీప్, తేజ ఒక్కొక్క వికెట్ తీసుకున్నారు. ఫైనల్ మ్యాచ్ అనంత రైజింగ్ స్టార్స్, కదిరి జట్ల మధ్య గురువారం మధ్యాహ్నం 1.30 గంటలకు ఆర్డీటీ క్రీడా మైదానంలో జరుతుంది ఈ మ్యాచ్లను అనంతపురం జిల్లా క్రికెట్ కార్యదర్శి భీమలింగారెడ్డి, జాయింట్ సెక్రెటరీ మురళి కృష్ణ, మాజీ కార్యదర్శి మచ్చా రామలింగారెడ్డి,సీనియర్ క్రికెటర్లు వెంకటేష్, కమలాకర్ నాయుడు, యుగంధర్ రెడ్డి, విజయరాజు పర్యవేక్షించారు

**రేపు ఉదయం చంద్రమోహన్ సంతాప సభ మాజీ క్రికెటర్ల మ్యాచ్**

చంద్రమోహన్ సంతాప సభ రేపు ఉదయం 9 గంటలకు ఆర్డిటి మైదానంలో జరుగుతుందని అనంతరం సీనియర్ క్రికెటర్లు ఒక ఎగ్జిబిషన్ మ్యాచ్ ఆడతారని అనంతపురం జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి భీమ లింగారెడ్డి తెలిపారు చంద్రమోహన్ కుటుంబ సభ్యులు అందరూ ఈ సమావేశంలో పాల్గొంటారని అనంతరం విజేతలకు చంద్రమోహన్ కుటుంబం చేతుల మీదుగా ట్రోఫీలు అందజేయడం జరుగుతుందని భీమ లింగారెడ్డి తెలిపారు చంద్రమోహన్తో క్రికెట్ ఆడిన క్రీడాకారులు అందరూ ఈ సమావేశంలో పాల్గొని విజయవంతం చేయవలసిందిగా జిల్లాలోని సీనియర్ క్రికెటర్లందరూ పాల్గొనవలసిందిగా భీమిలింగారెడ్డి విజ్ఞప్తి చేశారు

# కోట్ల ఇంటి పేరు కనుమరుగునా

**కర్నూలు :** మాజీ ముఖ్యమంత్రి కుమారుడు కోట్ల సూర్య ప్రకాశ్ రెడ్డి రాజకీయాల్లో ఉన్నారా? లేదా? అని అనిపించేలా ఉంది. గతంలో ఏ పదవీ లేనప్పుడే కోట్ల సూర్య ప్రకాశ్ రెడ్డి యాక్టివ్ గా తిరిగే వారు. అంతేకాదు నిరంతరం ప్రజల్లో తిరుగుతూ ఇంటిపేరు తెరమరుగు కాకుండా సూర్యప్రకాశ్ రెడ్డి ప్రయత్నించేవారు. కానీ 2024 ఎన్నికల నాటి నుంచి కోట్ల సూర్య ప్రకాశ్ రెడ్డి ఎందుకో మౌనంగా ఉండటంతో పాటు ఒక శాసనసభ నియోజకవర్గానికే పరిమితయ్యారు. ఒకప్పుడు కర్నూలు జిల్లాను శాసించిన కోట్ల కుటుంబం ఇప్పుడు కేవలం ఒక నియోజకవర్గానికే పరిమితమయింది. ఇక పార్టీలోనూ ఆయనకు పెద్దగా ప్రయారిటీ కనిపించకపోవడంతో తాను పార్టీ మారి తప్పు చేశానా? అన్న ఆలోచనలో పడిపోయారం టారు. కోట్ల సూర్య ప్రకాశ్ రెడ్డి మాజీ ముఖ్యమంత్రి కోట్ల విజయభాస్కర్ రెడ్డి కుమారుడు. ఇప్పటికీ కోట్ల ఫ్యామిలీకి కర్నూలు జిల్లాలో మంచి పేరుంది. కర్నూలు పార్లమెంటు నియోజకవర్గం అంటే ఆయనకు ఎనలేని ప్రేమ. అక్కడి నుంచి గెలిచి కాంగ్రెస్ హయాంలో కోట్ల సూర్య ప్రకాశ్ రెడ్డి కేంద్ర మంత్రి పదవి కూడా దక్కించుకోగలిగారు. మాజీ ముఖ్యమంత్రి కుమారుడిగానే కాకుండా తనకంటూ ఒక ప్రత్యేక వర్గాన్ని ఏర్పాటు చేసుకున్నారు. అయితే 2024 ఎన్నికలకు ముందు ఆయన కాంగ్రెస్ పార్టీ నుంచి టీడీపీలో చేరిపోయారు. ఎన్నో ఆశలు పెట్టుకుని పార్టీలో చేరిన కోట్ల సూర్య ప్రకాశ్ రెడ్డికి తర్వాత జరుగుతున్న పరిణామాలు రాజకీయంగా నీరసం తెప్పించాయని చెప్పాలిడోన్ నియోజకవర్గం నుంచి కూటమి హవాలో గెలుపొందిన కోట్ల సూర్య ప్రకాశ్ రెడ్డి తనకు మంత్రి పదవి దక్కుతుందని భావించినా అది జరగలేదు.దీంతో ఆయన సాధారణ ఎమ్మెల్యేగానే మిగిలిపోయారు. కోట్ల సూర్య ప్రకాశ్ రెడ్డి చాలా రోజుల తర్వాత శాసనసభకు పోటీ చేశారు. నిజానికి ఆయన కర్నూలు పార్లమెంటుకు పోటీ



చేయాలని ఉన్నా చంద్రబాబు డోన్ టిక్కెట్ ఇవ్వడంతో తప్పని సరి పరిస్థితుల్లో ఆయన శాసనసభకు పోటీ చేయాల్సి వచ్చింది. ఆయన ఎన్నికల వేళ నేరుగా కూడా ప్రజలతో చెప్పారు. తాను కర్నూలు పార్లమెంటుకు పోటీ చేయాల్సి ఉందని, అయితే అనివార్య కారణాలతో పోటీ చేయలేకపోయానని కన్నీటి పర్యతంతమయ్యారు. నిజానికి కోట్ల సూర్య ప్రకాశ్ రెడ్డి ఎప్పుడూ శాసనసభ వైపు చూడలేదు. ఢిల్లీ వైపు ఆయన చూపు ఉంటుంది. పార్లమెంటు సభ్యుడిగా ఉంటే ఆ గౌరవం వేరు అని ఆయన భావిస్తారు. కుటుంబానికి ఉన్న ప్రతిష్టతో పాటు గౌరవం కూడా నిలబడుతుందని ఆయన అనుకుంటారు.కర్నూలు జిల్లా నుంచి టీజీ భరత్, బీసీ జనార్ధన్ రెడ్డిలు మంత్రులుగా ఎంపిక చే?సుకోవడంతో కోట్ల సాధారణ ఎమ్మెల్యేగానే మిగిలిపోయారు. కోట్ల సూర్య ప్రకాశ్ రెడ్డి కి మంత్రి పదవి ఇస్తే కేఈ కుటుంబానికి కూడా ఇవ్వాల్సి ఉంటుంది. ఎందుకంటే రెండు కుటుంబాలకు రాజకీయ వైరం ఈ నాటిది కాదు. అందుకే కోట్ల సూర్య ప్రకాశ్ రెడ్డిని చంద్రబాబు పక్కన పెట్టారన్న వాదనల్లో కూడా నిజముంది. పార్టీ కార్యక్రమాలకు కూడా ఆయన పెద్దగా హాజరు కావడం లేదు అని చెబుతున్నారు. డోన్ లో అప్పుడప్పుడు పర్యటిస్తూ తాను ఎమ్మెల్యే అనేకంటే మాజీ ఎంపీగానే ఆయన చెలామణి అవుతూ తిరుగుతున్నారని పార్టీ వర్గాలే చెబుతున్నాయి. మొత్తం మీద కోట్ల సూర్య ప్రకాశ్ రెడ్డి మాత్రం ఏం చేయలేని పరిస్థితుల్లో మౌనంగానే ఉంటూ ఈ నాలుగేళ్లు గడిస్తే చాలు అని అనుకుంటున్నారట.

# తెలంగాణ బాటలో ఆంధ్రా...

**విజయవాడ :** నాన్‌లోకల్ కోటా రిజర్వేషన్లపై తెలంగాణ బాటలో ఏపీ పయనిస్తోంది. ఇప్పటికే తెలంగాణలో 15శాతం నాన్ లోకల్ కోటాను తెలంగాణ స్థానికత కలిగిన వారికి పరిమితం చేయగా తాజాగా ఏపీలో కూడా అదే విధానాన్ని అమలు చేసేలా రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. స్థానికేతర కోటాకు కొత్త నిర్వచనాలపై స్పష్టత ఇచ్చింది.ఏపీలో 15శాతం నాన్ లోకల్ కోటా రిజర్వేషన్లను రద్దు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. తాజా నిర్ణయంతో ప్రొఫెషనల్ కోర్సులు, డిగ్రీ, ఇంజనీరింగ్ వంటి ఉన్నత విద్య కోర్సుల్లో ప్రస్తుతం అమలవుతున్న 15% నాన్ లోకల్, జనరల్ కోటా సీట్లను ఇకపై పూర్తిగా ఏపీ వారికే కేటాయిస్తారు.2025-26 విద్యా సంవత్సరంలో నాన్ లోకల్ కోటా 15% సీట్లు ఆంధ్రప్రదేశ్ స్థానికత కలిగిన విద్యార్థులకే దక్కుతాయి. నాన్ లోకల్ సీట్లలో తెలంగాణకు చెందిన వారికి కూడా అవకాశం ఉండేది. ప్రభుత్వ ఉత్తర్వులతో తెలంగాణ సహా ఇతర రాష్ట్రాల వారికి ఈ అవకాశం ఉండదు.ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విభజన జరిగి పదేళ్లు పూర్తయిన నేపథ్యంలో ఉన్నత విద్యలో ప్రొఫెషనల్ కోర్సుల్లో అడ్మిషన్లు, ఉమ్మడి ప్రవేశ పరీక్షల నిబంధనల్లో స్థానిక, స్థానికేతర నిర్వచనాలను స్పష్టం చేస్తూ ఉన్నత విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్ జీవో-20, 21, 22లను జారీ చేశారు. తెలంగాణలో స్థానికతపై ఆ రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ స్థానికులకే వర్తింప చేయాలని స్పష్టం చేసింది. ప్రభుత్వ తాజా నిర్ణయంతో కన్వీనర్ కోటా సీట్లు 10%లో 85% సీట్లను స్థానికులకు కేటాయిస్తారు.

రెండు రీజియన్ల పరిధిలో ప్రవేశాలు..

ఏపీలో స్థానికత రెండు రీజి యన్లుగా అమలు చేస్తారు. ఆంధ్ర యూనివర్సిటీ, శ్రీవేంకటేశ్వర వర్సిటీ రీజియన్లుగా స్థానికతను నిర్ణయి స్తారు. విభజన తర్వాత 10 ఏళ్లుగా ఏపీలో ఆంధ్ర, శ్రీవేంకటేశ్వర, ఉస్మానియా రీజియన్లుగా సీట్ల భర్తీ చేసేవారు. తాజాగా ఉస్మానియా రీజియన్ ఏపీలో తొలగించారు. ఇకపై ఆంధ్ర, శ్రీవేంకటేశ్వర రీజియన్ల వారీగా సీట్లను భర్తీ చేస్తారు.

ఆంధ్ర రీజియన్‌లో ఈ జిల్లాలు..

ఉమ్మడి శ్రీకాకుళం, విజయనగరం, విశాపట్నం,



తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, కృష్ణా, గుంటూరు, ప్రకాశం జిల్లాలు ఏయూ పరిధిలో ఉంటాయి. ఈ జిల్లాల్లో చదివే విద్యార్థులను ఏయూ రీజియన్ స్థానికులుగా పరిగణిస్తారు.

శ్రీ వేంకటేశ్వర పరిధిలో జిల్లాలు...

ఉమ్మడి అనంతపురం, కర్నూలు, చిత్తూరు, కడప, నెల్లూరు జిల్లాలు ఎస్వీయూ పరిధిలో ఉంటాయి. ఈ జిల్లాల వారిని ఎస్వీ లోకల్‌గా పరిగణిస్తారు.స్థానికేతర, జనరల్ కోటా 15% సీట్ల కేటాయింపునకు కొన్ని నిబంధనలు విధించారు. ఆంధ్ర వర్సిటీ రీజియన్ అభ్యర్థులు.. శ్రీవేంకటే శ్వర రీజియన్‌లో 15% సీట్లకు పోటీ పడొచ్చు. శ్రీవేంకటేశ్వర రీజియన్ విద్యార్థులు.. ఆంధ్రా ప్రాంతంలో 15% స్థానికేతర సీట్లకు అర్హులవుతారు.

ఉద్యోగ ఉపాధి కారణాల రీత్యా తల్లిదండ్రులు ఇతర రాష్ట్రాల్లో ఉంటున్నా.. ఇద్దరిలో ఎవరైనా ఒకరు గతంలో పదేళ్ల పాటు ఏపీలో నివసించిన వారై ఉంటే వారి పిల్లలు ఈ కోటాలో పోటీ పడొచ్చు.

అభ్యర్థి ఏపీలో కనీసం 10 ఏళ్లు నివసించి ఉండాలి. రాష్ట్రం బయట చదువుకున్న కాలాన్ని మినహాయించిన తర్వాత పదేళ్లు ఏపీలో నివాసం ఉండాలి.

అండర్ గ్రాడ్యుయేషన్ కోర్సులకు గతంలో మాదిరిగానే రీజియన్ల వారీగా ఆరు నుంచి ఇంటర్మీడి యట్ చదువును ప్రామాణికంగా తీసుకుంటారు. బీటెక్, బీఫార్మసీ, బీఎస్సీ తదితర కోర్సులకు మొదట తొమ్మిదో తరగతి నుంచి ఇంట ర్మీడియట్ వరకు వరసగా నాలుగేళ్ల చదువును పరిగణలోకి తీసుకుంటారు.9 నుంచి ఇంటర్మీడియట్ వరకు వరసగా నాలుగేళ్లు ఆయా రీజియన్లలో చదవకపోయినా.. ఏడేళ్లలో నాలుగేళ్లు చదివి ఉండాలి. ఏడేళ్ల కాలంలో ఎక్కువ కాలం చదివిన ప్రాంతాన్ని వారి స్థానికతకు ప్రామాణికంగా తీసుకుంటారు.

స్థానిక ప్రాంతంలో ఏ విద్యా సంస్థల్లోనూ నాలుగేళ్లు చదవకపోయినా.. అభ్యర్థి హాజరయ్యే అర్హత పరీక్షకు ముందు నాలుగేళ్లు ఏ ప్రాంతంలో నివాసం ఉంటే దాన్ని స్థానికతగా పరిగణిస్తారు.

రెండు లేదా అంత కంటే ఎక్కువ ప్రాంతాల్లో చదివిన కాలం సమానంగా ఉంటే చివరిగా చదివిన ప్రాంతాన్ని స్థానికతగా తీసుకుంటారు.

రాష్ట్రంలో ఏడేళ్లు ఏ విద్యాసంస్థల్లో చదవకపోయినా.. అర్హత పరీక్ష రాయక ముందు నుంచి ఏడేళ్ల పాటు ఏపీలో నివసించి ఉంటే స్థానిక అభ్యర్థులుగా లెక్కిస్తారు. ఏపీలో ఉన్న ఏడేళ్లలో ఎక్కడ ఎక్కువ కాలం నివసించి ఉంటారో అక్కడ స్థానికులుగా పరిగణనలోకి వస్తారు.కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థలు, స్థానిక సంస్థలు, విశ్వవిద్యాల యాలు, ఇతర అనుబంధ సంస్థల్లో పని చేస్తున్న ఉద్యో గుల పిల్లలు ఏ రాష్ట్రానికి చెందిన వారైనా నాన్ లోకల్ సీట్లకు పోటీ పడొచ్చు.

రాష్ట్ర ప్రభుత్వ శాఖల్లో పని చేస్తున్న ఉద్యోగుల జీవిత భాగస్వాములు కూడా నాన్‌లోకల్ కోటాకు అర్హులు అవుతారు. ఇతర రాష్ట్రాల వారు ఇక్కడ పనిచేస్తుంటే వారి భాగస్వామి భార్య లేదా భర్త స్థానికేతర కోటాకు దరఖాస్తు చేసుకోవచ్చు.

## నేనెప్పుడూ నిత్య విద్యార్థినే!

-మొదటిపేజీ తరువాయి

కానీ సేవల రంగం కూడా మెరుగవ్వాలి. ఇండస్ట్రీలు కూడా పెరగాలి. తెలంగాణ ఆదాయంలో 67 శాతం సేవల రంగం నుండే వస్తోంది. అదే మన రాష్ట్రంలో 46 శాతం మాత్రమే ఉంది. రాష్ట్రంలో సేవల రంగంతోపాటు ఇండస్ట్రీని పెంచుకోవాల్సిన అవసరం ఉంది. ప్రపంచ వ్యాప్తంగా ప్రజల ఆహారపు అలవాట్లు మారుతున్నాయి. మంచి అరోగ్యం కోసం ప్రోటీన్ ఫుడ్ వైపు ప్రజలు మళ్లుతున్నారు. మిల్లెట్స్ వంటి వాటిపై ఆసక్తి చూపతున్నారు. వీటితోపాటు పండ్లు, కూరగాయలకు ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నారు. అందుకోసమే మనం ఉద్యానవన పంటలను అధికంగా పండించాలి. ఉద్యావన పంటల సంరక్షణ కోసం మైక్రో ఇరిగేషన్ చాలా అవసరం. మైక్రో ఇరిగేషన్‌పై అప్పటి వాజ్ పేయి ప్రభుత్వానికి నేనొక నివేదిక ఇచ్చాను. ఆ నివేదికనే ఇప్పటికీ మైక్రో ఇరిగేషన్‌కు ఒక బైబిల్‌గా వాడుతున్నారు. మైక్రో ఇరిగేషన్‌కు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం చిరునామాగా ఉంది.

నేను నిత్య విద్యార్థిని..

నేనెప్పుడూ నిత్య విద్యార్థిగా నేర్చుకుంటూనే ఉంటాను. టెక్నాలజీలో చాలా మార్పులు వస్తున్నాయి. దాన్ని అందిపుచ్చుకున్నవారు మాత్రమే ముందుకు సాగగలరు. హైదరాబాద్‌లో ఐటీని అభివద్ధి చేసిన కారణంగా ప్రపంచంలోనే అత్యధిక తలసరి ఆదాయం పొందుతున్న వారు భారతీయులు కాగా అందులో 35 శాతం మంది తెలుగు వారు ఉన్నారు. ప్రస్తుతం నాలెడ్జ్, టెక్నాలజీ అందుబాటులో ఉన్నాయి. వీటిని ఉపయోగించుకొని ఎంట్రప్రెన్యూర్లను తయారు చేయాలి. అందుకోసం ఏర్పడిన సంస్థనే జీఎఫ్ఎస్టీ. ఈ సంస్థ ముందుకు సాగేందుకు కొంతమేరకు మేం సహాయపడతాం... దీన్ని జాతీయ స్థాయిలో గొప్ప సంస్థగా రూపు దిద్దవలసింది నిర్వాహకులే. నాంది ఫౌండేషన్ నా సహాయంతో రెడ్డి ల్యాబ్స్ అధినేత అప్పట్లో ప్రారంభించారు. ఆ తర్వాత దాని నిర్వహణ ఆనంద్ మహీంద్రా చేతికి వెళ్లింది. ఇప్పుడు నాంది ఫౌండేషన్ ఎంత సేవ చేస్తుందో మనం చూస్తూనే ఉన్నాం. అలాగే బసవతారకం క్యాన్సర్ హాస్పటల్ ఒక ట్రస్టుగా ఆ రంగంలో సేవలందిస్తున్న సంస్థల్లో దేశంలోనే మేటైన ట్రస్టుగా ఉంది. అలాగే ఎన్. టి.ఆర్ మెమోరియల్ ట్రస్ట్‌ను కూడా ఏర్పాటు చేసి సేవలందిస్తున్నాం అని సీఎం చంద్రబాబు అన్నారు.

## పండుగ వాతావరణంలో తెదేపా మహానాడు..

-మొదటిపేజీ తరువాయి

రవాణాకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలి” అని నేతలకు దిశానిర్దేశం చేశారు.

**మే 29న బహిరంగ సభ**

మూడు రోజుల పాటు జరిగే ఈ మహానాడులో.. మొదటి రోజు తెదేపా విధి విధానాలు, సిద్ధాంతాలు, కార్యాచరణపై చర్చించనున్నారు. రెండో రోజు రాష్ట్రం కోసం కూటమి ప్రభుత్వం చేపట్టిన పలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై రూపొందించిన తీర్మానాలు చేయనున్నారు. మూడో రోజు బహిరంగ సభ నిర్వహించనున్నారు. పార్లమెంట్ మహానాడు, నియోజకవర్గ మహానాడు నిర్వహణపైనా ఈ సమావేశంలో చర్చించారు. ఈ సమావేశంలో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, మంత్రులు అనగాని సత్యప్రసాద్, నిమ్మల రామానాయుడు, సవిత, పి.నారాయణ, గొట్టిపాటి రవికుమార్, డాక్టర్ డోలా బాలవీరాంజనేయ స్వామితో పాటు సీనియర్ నేతలు బీద రవిచంద్ర యాదవ్, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, దామచర్ల సత్య, రెడ్డప్పగారి శ్రీనివాస రెడ్డి, వీరంకి వెంకట గురుమూర్తి, మంతెన రామరాజు, సి.భూపేష్ రెడ్డి, ఎమ్మెల్యేలు జ్యోతుల నెహ్రూ, ఆర్.మాధవి రెడ్డి, జీవీ ఆంజనేయులు, మంతెన సత్యనారాయణ రాజు, చింతకాయల విజయ్ తదితరులు పాల్గొన్నారు.

## చెరువుల్లో మునిగి 8 మంది మృతి

-మొదటిపేజీ తరువాయి

చెరువు వద్ద ఆగారు. ఈ క్రమంలో ప్రమాద వశాత్తూ చెరువులో పడి ముగ్గురు మృతి చెందారు. మృతులు పెదవేగి మండలం వేగివాడ గ్రామానికి చెందిన అజయ్ (28), అభిలాష్ (16), సాగర్ (16)గా గుర్తించారు.

## ‘ప్రభుత్వం ఆదుకోకపోతే రైతులు ఎలా బతకాలి? ’

**తాడేపల్లి :** రైతులను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గాలికొదిలేశారని మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు ధ్వజమెత్తారు. కౌలుదారు రైతులనైతే చంద్రబాబు అస్సలు పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. ఈరోజు(బుధవారం) తాడేపల్లిలోని వైఎస్సార్ సీపీ కేంద్ర కార్యాలయం నుంచి మాట్లాడిన కారుమూరి.. జగన్ హయాంలో కౌలు రైతులకు పెద్ద పీట వేస్తే, చంద్రబాబు ప్రభుత్వం మాత్రం వారిని పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. ‘జగన్ హయాంలో కౌలు రైతులకు పెద్ద పీట వేశారు. పంట నష్టం వచ్చినా అందుకున్నారు. బ్యాంకుల ద్వారా రుణాలు ఇప్పించారు. చంద్రబాబు వచ్చాక కౌలుదారీ కార్డులు తొలగించారు. ఖరీఫ్ సీజన్ కి మరో 15 రోజులే సమయం ఉంది. ఈలోపు కౌలుదారులకు కూడా న్యాయం చేయాలి. 80% మంది ఉన్న కౌలు రైతుల మేలు గురించి పట్టించుకోకపోవడం దారుణం. జగన హయాంలో తడిసిన ధాన్యం కూడా చివరి గింజ వరకు కొనుగోలు చేశారు. కౌలు రైతుకు కూడా కార్డులు ఇస్తే ఎక్కడ ప్రభుత్వ మేలు చేయాల్సి వస్తుందోనని చంద్రబాబు ఇవ్వటం లేదు. 32 లక్షల మంది కౌలు రైతులు చంద్రబాబు వలన ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం ఆదుకోకపోతే రైతులు ఎలా బతకాలి?, వ్యవసాయ శాఖ మంత్రి ఏం చేస్తున్నారో అర్థం కావటం లేదు. వ్యవసాయం దండగ అనే ఆలోచనలోనే ఇంకా చంద్రబాబు ఉన్నారు. అమరావతి మీద చూపే ప్రేమ రైతుల మీద కూడా చూపించండి. పొగాకుకు ధరల్లేక రైతులు కన్నీళ్ళు పెడుతుంటే చంద్రబాబు ఎందుకు పట్టించుకోవడం లేదు?, పొగాకు రైతులు ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితికి వచ్చారు. జగన్ హయాంలో రూ.18 వేలు ఉన్న ధర ఇప్పుడు రూ.10వేలు కూడా లేదు రైతులను వదిలేసి అమరావతి, భ్రమరావతి అంటూ చంద్రబాబు తిరుగుతున్నారు. పొగాకు రైతులకు వైఎస్సార్ సీపీ అండగా ఉంటుంది. వారి తరపున పోరాటం చేస్తాం. పవన్ కళ్యాణ్ పొగాకు రైతులను ఆదుకునేందుకు కేంద్రంతో మాట్లాడాలి. చంద్రబాబు, పవన్ కళ్యాణ్, లోకేష్.. అందరూ స్పెషల్ ఫ్లైట్లలో తిరుగుతున్నారు. ప్రభుత్వ సొమ్మును ఇష్టానుసారం వాడుకుంటున్నారు’ అని మండిపడ్డారు.

## ఎయిమ్స్‌లో రోబోటిక్ సర్జరీలు

-మొదటిపేజీ తరువాయి

తెలుసా. అవును నగరంలో విమ్స ఆస్పత్రిలో ఈ సేవలు అందుబాటులో ఉన్నాయి. విమ్స్‌లోని ఎముకల విభాగానికి ఎక్కువ మంది వస్తుండగా.. మోకాళ్ల నొప్పులకు అత్యాధునిక ప్లాస్మా చికిత్స ఉచితంగా అందుబాటులో ఉంది. ప్రైవేట్ ఆసుపత్రుల్లో వేలల్లో ఖర్చయ్యే ఈ చికిత్సను విమ్స్‌లో ఉచితంగా అందిస్తున్నారు. దీని ద్వారా చాలా మంది నొప్పుల నుంచి ఉపశమనం పొందుతున్నారు. విమ్స ఆసుపత్రి ఇప్పుడు కేజీహెచ్‌కి మరో ఆసుపత్రిలా ఉపయోగపడుతుంది. కేజీహెచ్ దూరంగా ఉన్నవాళ్లు, శివారు ప్రాంతాల వాళ్లు ఇక్కడికి వస్తున్నారు. ప్రతిరోజు 500 నుంచి 700 మంది ఓపీకి వస్తుంటారు. అందులో 180 నుంచి 225 మంది వరకు ఆసుపత్రిలో చేరి చికిత్స తీసుకుంటారు. అన్ని విభాగాలకన్నా ఎముకల సమస్యలతో వచ్చేవాళ్లే ఎక్కువ.విమ్స్‌లో మోకాళ్ల నొప్పులకు సరికొత్త ప్లాస్మా ట్రీట్‌మెంట్ ఉంది. బయట ప్రైవేట్ ఆసుపత్రుల్లో ఈ ట్రీట్‌మెంట్ చేయించుకుంటే చాలా డబ్బులు అవుతాయి. కానీ విమ్స్‌లో మాత్రం ఉచితంగా చేస్తున్నారు. దీని ద్వారా ఏటా వేల మంది నొప్పులు తగ్గిపోతున్నాయి. 50 ఏళ్లు దాటకుండానే చాలామంది మోకాళ్ల నొప్పులతో బాధపడుతున్నారని.. కొంతమందికి మోకాళ్ల చిప్పలు అరిగిపోయి నడవలేని పరిస్థితి వస్తుంది. దీనికి ప్లాస్మా థెరపీ అనే కొత్త వైద్యం అందుబాటులో ఉంది.బయట ఆసుపత్రుల్లో ఈ ట్రీట్మెంట్ ఖరీదైనది కావడంతో పేదలు, మధ్యతరగతి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అలాంటి వారికి విమ్స్‌లో ఉచితంగా ప్లాస్మా చికిత్స అందిస్తున్నాము అన్నారు. ఈ ట్రీట్‌మెంట్‌లో మోకాళ్లలోని రక్తాన్ని తీసి, దాని బదులు ప్లాస్మాను ఎక్కిస్తారు. ఇలా రెండు మూడు సార్లు చేస్తే రోగులు నార్మల్‌గా నడవగలుగుతారు. ఈ విభాగంలో 5 మంది డాక్టర్లు, 10 మంది సిబ్బంది పనిచేస్తున్నారు. తీవ్రమైన మోకాళ్ల నొప్పులతో బాధపడేవాళ్లకు పీఆర్‌పీ విధానంలో ట్రీట్‌మెంట్ చేస్తున్నారు అక్కడి డాక్టర్లు. దీనివల్ల రోగులు నొప్పి లేకుండా నడవగలుగుతారని.. ఈ తరహా చికిత్స రాష్ట్రంలో మరే ఇతర ప్రభుత్వాసుపత్రిలో లేదని.. ఆ ఘనత విమ్స్‌కే దక్కుతుందంటున్నారు. ఎముకల విభాగం ఓపీకి ఎక్కువ మంది వస్తుండగా.. ఫిజియోథెరపీతోనే చాలామందికి నొప్పులు తగ్గుతున్నాయట.. అవసరమైన వాళ్లకు ఆపరేషన్లు కూడా చేస్తున్నారు డాక్టర్లు. విమ్స్‌లో ఏడాదిలో మోకాళ్ల చిప్పల మార్పిడి - 38, తుంటి ఎముక - 22, ప్లేట్లెట్ రిచ్ ప్లాస్మా థెరపి(పీఆర్‌పీ) (మోకాళ్ల నొప్పులు ఉన్న వారికి) - 1800, ఫిజియో థెరపి - 18,000 పూర్తిచేశామంటున్నారు.

## నారా లోకేష్ పర్యటన కోసం

# త్వరితగతిన ఏర్పాట్లు పూర్తి చేయాలి.





: మంత్రి పర్యటించే ప్రాంతాలను పరిశీలించిన జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి,

**అంకుశం న్యూస్ అనంతపురం, మే 14:** రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ మరియు మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి నారా లోకేష్ పర్యటన కోసం త్వరితగతిన ఏర్పాట్లు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి, సంబంధిత అధికారులను ఆదేశించారు. గౌరవ రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ మరియు మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి నారా లోకేష్ గారు ఈనెల 15, 16, 17 వ తేదీలలో అనంతపురం జిల్లా పర్యటనలో భాగంగా గుత్తి మండలం బేతాపల్లిలో పర్యటిస్తుండగా, గ్రామం వద్ద హెలిప్యాడ్, సభా వేదిక మరియు రెన్యూ విండ్ ఎనర్జీ (జెఎఎంబి) ప్రైవేట్ లిమిటెడ్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి సంబంధించి ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. మంత్రి నారా లోకేష్ పర్యటన కోసం పకడ్బందీగా ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. హెలిప్యాడ్ ను వెంటనే సిద్ధం చేయాలని, ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేపట్టాలని, మంత్రి పర్యటించనున్న ప్రదేశాలలో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టాలని ఆదేశించారు. ఎలాంటి లోటుపాట్లు లేకుండా ఏర్పాట్లు ఉండాలన్నారు. సభ ప్రాంగణం వద్దగల హై టెన్షన్ టవర్ వద్ద బార్కెట్స్ ఏర్పాటు చేయాలని ఆర్.అండ్.బి అధికారులను, అటువైపు ఎవరిని వెళ్లకుండా చూడాలని పోలీస్ అధికారులను ఆదేశించారు. మంత్రి పర్యటనపై ఆయా శాఖల అధికారులు ఏర్పాట్లపై తగు సూచనలు, సలహాలను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ, గుంతకల్ ఆర్డీవో శ్రీనివాసరెడ్డి, తహసీల్దార్ ఓబులేసు, ఆర్.అండ్.బి అధికారులు, పోలీసు అధికారులు, ఆయా శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## వేగుళ్ళ అధ్యక్షతన 2019-2022 ఏడాదిల బడ్జెట్ ఎస్టిమేట్స్ పై అసెంబ్లీ ఎస్టిమేట్స్ కమిటీ సమీక్ష





**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అంకుశం న్యూస్ రిపోర్టర్ మే 14:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అసెంబ్లీ అంచనాల కమిటీ చైర్మన్, మండపేట ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు అధ్యక్షతన ఎస్టిమేట్స్ కమిటీ సమావేశం మంగళవారం రాష్ట్ర అసెంబ్లీ భవనంలోని కమిటీ హాల్లో నిర్వహించారు. ఈ సమావేశంలో 2019 నుండి 2022 వరకూ మూడేళ్ళ కాలంలో సాంఘిక, గిరిజన, మైనార్టీ సంక్షేమ శాఖలతో పాటు పంచాయితీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖలకు సంబంధించిన బడ్జెట్ అంచనాలపై ఆయా శాఖల అధికారులతో సమీక్షించారు. తొలిరోజైన మంగళవారం ఉదయం 11 గంటలకు సాంఘిక సంక్షేమశాఖ, మధ్యాహ్నం 2 గంటలకు గిరిజన సంక్షేమశాఖ, 3 గంటల 30 నిమిషాలకు మైనార్టీ సంక్షేమ శాఖల అధికారులతో సమావేశమై 2019-20, 2020-21, 2021-22 ఆర్థిక సంవత్సరాల్లో ఆయా శాఖలకు సంబంధించిన బడ్జెట్ అంచనాలపై సమీక్ష నిర్వహించడం జరిగింది. ఈ సమావేశంలో రాష్ట్ర అసెంబ్లీ అంచనాల కమిటీ సభ్యులు భూమ అఖిలప్రియ, డా?పార్థసారధి, అసెంబ్లీ ఉప కార్యదర్శి రాజ్ కుమార్,సాంఘిక, గిరిజన, మైనార్టీ సంక్షేమ శాఖల అధికారులు, తదితర్లు పాల్గొన్నారు.

## ఎంపి కేశినేని శివనాథ్ ను మర్యాదపూర్వకంగా

# కలిసిన ఏపీ ప్రెస్ అకాడమీ చైర్మన్ ఆలపాటి సురేష్





**అంకుశం ప్రతినిధి విజయవాడ : మే 14** ఏపీ ప్రెస్ అకాడమీ చైర్మన్‌గా నియమితులైన సీనియర్ జర్నలిస్ట్, రచయిత ఆలపాటి సురేశ్‌కుమార్ ఎంపి కేశినేని శివనాథ్ (చిన్ని) ను మర్యాదపూర్వకంగా కలిశారు. గురునానక్ కాలనీలోని విజయవాడ పార్లమెంట్ కార్యాలయం ఎన్టీఆర్ భవన్ కి బుధవారం విచ్చేసిన ఆలపాటి సురేష్ కి ఎంపి కేశినేని శివనాథ్ సాదర స్వాగతం పలికారు. ఏపీ ప్రెస్ అకాడమీ చైర్మన్‌గా నియమితులైన ఆలపాటి సురేష్ కి అభిందనలు తెలపటంతో పాటు శాలుతో సత్కరించి బుద్ధుడి ప్రతిమను బహుకరించారు. తనకి అభినందలు తెలిపిన ఎంపి కేశినేని శివనాథ్ కు ఆలపాటి సురేష్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ మంతెన సత్యనారాయణ రాజు, ఏపీ బిల్డింగ్ అదర్ కనస్ట్రక్షన్ వర్కర్స్ అడ్వయిజరీ కమిటీ చైర్మన్ గొట్టుముక్కల రఘురామరాజు, రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి జంపాల సీతారామయ్య, టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి నాగుల్ మీరా, ఎన్టీఆర్ జిల్లా తెలుగు రైతు సంఘం అధ్యక్షులు చెరుకూరి రాజేశ్వరరావు ,టిడిపి సీనియర్ నాయకులు బొప్పన భవకుమార్, టిడిపి యువనాయకుడు దేవినేని చందు పాల్గొన్నారు.

## మిరియం గురవయ్యను పరామర్శించిన దారపనేని బ్రదర్స్



**కనిగిరి మే 14 అంకుశం న్యూస్:** కనిగిరి నియోజకవర్గం పామూరు మండలం తూర్పు కోడిగుడ్లపాడు గ్రామపంచాయతీ పోతవరం గ్రామ తెలుగుదేశం పార్టీ నాయకులు మిరియం గురవయ్య ఇటీవల గుండెపోటు వ్యాధితో బాధపడుతూ ఒంగోలు కిమ్స్ కార్పొరేట్ హాస్పటల్లో మెరుగైన వైద్యం చేయించుకుని సంపూర్ణ ఆరోగ్యంతో తిరిగివచ్చారు. బుధవారం కనిగిరి మాజీ ఏఎంసీ చైర్మన్ దారపనేని చంద్రశేఖర్ , తూర్పు కోడిగుడ్లపాడు మాజీ సర్పంచ్ దారపనేని జనార్దన్ రావు మిరియం గురవయ్యను పరామర్శించి సోదరుడు మిరియం సుబ్బరాయుడును యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. దారపనేని చంద్రశేఖర్ గురవయ్యతో ఆరోగ్యం పై అశ్రద్ధ విడనాడి ఆరోగ్యవంతులుగా ఉండేందుకు కృషి చేయాలన్నారు. నాగినేని రమేష్ బాబు, చెనికల చిన మాల కొండయ్య, నాగేశ్వరరావు, శ్రీనివాసులు, కొండయ్య (కరణం ) మానం మల్లికార్జునరావు, ధనియాల తిరుపతయ్య మిరియం గురవయ్యను పరామర్శించిన వారిలో ఉన్నారు.

## ఏడాది పూర్తవుతున్నా ఇచ్చిన హామీలు నిలబెట్టుకోని కూటమి ప్రభుత్వం

ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలి



**కోనసీమ జిల్లా అంకుశం న్యూస్ రిపోర్టర్ మే 14:** గత ఏడాది అసెంబ్లీ ఎన్నికలు జరిగి ఏడాది పూర్తవుతున్నా ఇచ్చిన హామీలు నిలబెట్టుకోవడంతో కూటమి ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని అఖిల భారత కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర చైర్మన్ కామన ప్రభాకరరావు ఆరోపించారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా, మండపేట కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో బుధవారం ఉదయం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఏడాది కాలం లో కనీసం 10 శాతం హామీలు కూడా కూటమి నాయకులు నెరవేర్చలేకపోయారని మండిపడ్డారు. ఏడాది కాలంలో మూడు గ్యాస్ సిలిండర్ లు ఉచితంగా ఇవ్వాల్సిందిగా ఒక్కొక్క సిలిండర్ మాత్రమే ఇచ్చారని, అది కూడా కొందరికి ఇవ్వకుండా మొండి చేయి చూపారని ఆరోపించారు. మహిళలకు ఉచిత బస్సు పథకం ఏమైందని ప్రశ్నించారు. ప్రతి మహిళకు నెలకు 1500 రూపాయలు ఇస్తామని నమ్మించి ఓట్లు వేయించుకున్నారని, కానీ ఇప్పుడు పథకం మాట పూర్తిగా విస్మరించారని దుయ్యబట్టారు. తల్లికి వందనం కింద ప్రతి బిడ్డకు ఇస్తామన్న నిధులు ఏమయ్యాయని ప్రశ్నించారు. నిరుద్యోగ సమస్యను పరిష్కరిస్తామని చెప్పి, అంత వరకు నిరుద్యోగ భృతి కల్పిస్తామని ప్రభుత్వం నమ్మించి యువత ఓట్లు దక్కించుకున్నారని, కానీ ఇప్పుడు వారికి ఏం సమాధానం చెబుతారని ప్రశ్నించారు. మరో వైపు రైతులకు ఏటా ఇస్తామన్న 20 వేల రూపాయల సహాయం మాట ఎవరూ ఎత్తడం లేదన్నారు. అటు కేంద్రం లో మోడీ, ఇటు రాష్ట్రం లో చంద్రబాబు, పవన్ కళ్యాణ్ ముగ్గురూ ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో దారుణంగా విఫలమయ్యారని ఆరోపించారు. ఈ హామీలు ఎప్పుడూ నెరవేరుస్తారో ప్రజలకు సమాధాన చెప్పాలన్నారు. గత వైసీపీ ప్రభుత్వం అరాచక పాలన సాగించిందని ప్రజలు కూటమి ప్రభుత్వానికి అధికారం కట్టబెడితే ఇప్పుడు వారు వైసీపీ ను మించిన అరాచక పాలన సాగిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం కళ్ళు తెరుచుకుని ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కామన డిమాండ్ చేశారు.

## పుట్టపర్తి పర్యాటక

# అభివృద్ధికి చేయూత నివ్వండి.



సత్య సాయి బాబా 100జన్మదినోత్సవం ఘనంగా నిర్వహిద్దాం

పుట్టపర్తి లో పలు పర్యాటక ప్రాంతాలను పరిశీలించిన ఎమ్మెల్యే,మాజీ మంత్రి, జాయ్ లూక్కాస్ కంపెనీ ప్రతినిధులు



**అంకుశం ప్రతినిధి పుట్టపర్తి :14** పుట్టపర్తి భగవాన్ శ్రీ సత్యసాయిబాబా 100 వ శత జయంతోత్సవాల సందర్భంగా పలు అభివృద్ధి పనులకు తగిన చేయుతనివ్వాలని పలు కార్పొరేట్ సంస్థలను కోరారు. పుట్టపర్తి మున్సిపల్ పరిధిలోని శిల్పారామం పుడా పరిధిలో ఉన్న పార్కు స్థలాన్ని చిత్రావతి పరివాహక ప్రాంతం ఆంజనేయస్వామి విగ్రహం, తదితర ప్రాంతాల్లో ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి తో పాటు మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి , సామకోటి ఆదినారాయణ ,ప్రముఖ జాయ్ లుక్కాస్ జ్యువెలరీ కంపెనీ ప్రతినిధులు జాయ్ లూకాస్, రోబిన్ ,మున్సిపల్ కమిషనర్ ప్రహ్లాద,ప్రభుత్వ అధికారులు, పర్యాటక అధికారి నర్సయ్య ,స్థానిక ప్రజాప్రతినిధులు,టీడీపీ నాయకులతో పాటు పరిశీలించారు. పుట్టపర్తి చిత్రావతి ప్రాంతాన్ని సుందరీకరణ అభివృద్ధి పనులకు కార్పొరేట్ సోషియల్ రెస్పాన్స్ బ్యూలిటి నిధులతో అభివృద్ధి చేయాలని పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి జాయ్ లూకాస్ జ్యువెలరీ ప్రతినిధులను కోరారు. అదే విధంగా పుడా పరిధిలో ఉన్న 14 పార్కుల అభివృద్ధికి తగిన తోడ్పాటు నివ్వాలనీ విన్నవించారు. పుట్టపర్తి శిల్పారామంలో తగిన మౌలిక వసతుల కల్పనకు తగిన అభివృద్ధికి సహకారం ఇవ్వాలన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ టీ ఎస్ చేతన్ ను ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి తోపాటు జాయ్ లూకాస్ జ్యువెలరీ కంపెనీ ప్రతినిధులు జాయ్ లూకాస్ , రిబిన్ తో కలసి అభివృద్ధి పనులపై చర్చించారు. తమ కంపెనీ ద్వారా పుట్టపర్తి పర్యాటక రంగ అభివృద్ధికి తగిన నిధులు ఇచ్చి సహాయ సహకారాలు అందిస్తామని ఆ కంపెనీ ప్రతినిధులు జాయ్ లుక్కాస్ , రిబిన్ లు తెలిపారు. సత్య సాయి బాబా ఆశీస్సులు ప్రజలపై ఎల్లప్పుడూ ఉండాలని వారు కోరుకున్నారు.అనంతరం ప్రముఖ జాయ్ లూకాస్ జ్యూవెలరీ కంపెనీ ప్రతినిధులను పుట్టపర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి చేతుల మీదుగా సత్యసాయి బాబా చిత్ర పటాన్ని బహుకరించి వారిని శాలువాతో సత్కరించారు.

## స్వర్ణాంధ్ర, స్వచ్ఛ ఆంధ్ర మొబైల్ యాప్

జిల్లాలోని అన్ని శాఖల హెచ్ ఓ డి లు అవగాహన కలిగి ఉండాలి

జిల్లా కలెక్టర్ టీఎస్ చేతన్




**అంకుశం న్యూస్ పుట్టపర్తి, మే 14:** స్వర్ణాంధ్ర, స్వచ్ఛ ఆంధ్ర మొబైల్ యాప్ పై జిల్లాలోని అన్ని శాఖల హెచ్ ఓ డి లు అవగాహన కలిగి ఉండాలి జిల్లా కలెక్టర్ టీఎస్ చేతన్ పేర్కొన్నారు. బుధవారం స్థానిక కలెక్టరేట్లోనే పి జి ఆర్ ఎస్ సమావేశ మందిరంలో ఈనెల 17వ తేదీ మూడో శనివారం స్వర్ణాంధ్ర స్వచ్ఛ్ ఆంధ్ర కార్యక్రమాల ముందస్తు ఏర్పాట్లపై సమీక్ష సమావేశం నిర్వహించారు ఈ కార్యక్రమంలో డిపిఓ సమత, గ్రామ వార్డు సచివాలయాల నోడల్ ఆఫీసర్ సుధాకర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మూడవ శనివారం స్వచ్ఛంద కార్యక్రమంలో భాగంగా బీట్ ద హీట్ ,వేసవి వడగాలుల బారిన పడకుండా తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్త చర్యలు ప్రజలందరికీ వివరించాలన్నారు.ఆ రోజున గ్రామాల్లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో స్వయం సహాయక సంఘాల మహిళలు, ఉపాధి హామీ శ్రామికులు, గ్రామపంచాయతీల పారిశుధ్య కార్మికులు తదితరులతో సమావేశం నిర్వహించి వారికి వేసవి వడగాలుల దృష్ట్యా తీసుకోవలసిన ముందస్తు జాగ్రత్తలు వివరించాలన్నారు. వారు చేయవలసిన పనులు చేయకూడని పనులు ఏమిటో స్పష్టంగా తెలియజేయాలన్నారు. ఇందుకు సంబంధించిన కరపత్రాలను కూడా సిద్ధం చేసి ఆ రోజున ప్రజలందరికీ పంపిణీ చేయాలన్నారు.పిల్లలు వయోవృద్ధుల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో 5 పడకలను ప్రత్యేకించి వడగాలుల బాధితుల కోసంకేటాయించాలన్నారు. . అన్ని గ్రామాలు, పట్టణాల్లోనూ ముఖ్యమైన ప్రదేశాలలో చలివేంద్రాలను ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# స్విమ్స్ లో మరింత ఉన్నతంగా వైద్య సేవలు

– టిటిడి ఛైర్మెన్ బీ ఆర్ నాయుడు





**అంకుశం న్యూస్ తిరుపతి మే 14:** తిరుపతి స్విమ్స్ లో మరింత ఉన్నతంగా వైద్యసేవలు అందిస్తామని టిటిడి ఛైర్మెన్ శ్రీ బీ ఆర్ నాయుడు తెలిపారు. టిటిడి ఛైర్మెన్ బీఆర్ నాయుడు అద్యక్షతన స్విమ్స్ సమావేశ మందిరంలో బుధవారం గవర్నింగ్ కౌన్సిల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఛైర్మెన్ మాట్లాడుతూ స్విమ్స్ లో మరింత ఉన్నతంగా సేవలు అందించేందుకు గత మూడు నెలల నుండి మాజీ టిటిడి ఈవో ఐవి సుబ్బారావు అధ్యక్షతన వేసిన ప్రత్యేక ఎక్స్ ఫర్ట్ కమిటీ అధ్యయనం చేసి నివేదికను సమర్పించిందన్నారు. ఈ నివేదికలో మౌళిక సదుపాయాలు, మానవ వనరులు, వైద్య పరికరాలు, ఇంజనీరింగ్ పనులు, మరింత ఉన్నతంగా వైద్య సేవలు అందించేందుకు వైద్య నిపుణుల సేవలు, నిధుల సేకరణ తదితర అంశాలపై నివేదిక సమర్పించిందన్నారు. ఎక్స్ ఫర్ట్ కమిటీ నివేదికపై టిటిడి బోర్డులో చర్చించి రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం మేరకు తదుపరి నిర్ణయం తీసుకుంటామన్నారు. స్విమ్స్ అభివృద్ధికి సూచనలు, సలహాలు ఇస్తున్న ఎక్స్ ఫర్ట్ కమిటీ ఛైర్మెన్ డా. ఐ.వి. సుబ్బారావు, ఇతర సభ్యులను టిటిడి ఛైర్మెన్ కోరారు.

ఈ సందర్భంగా టిటిడి ఈవో జె. శ్యామల రావు మాట్లాడుతూ, స్విమ్స్ చాలా ప్రతిష్టాకమైనదని, 2021లో టిటిడిలోకి స్విమ్స్ ను అప్పగించారని, స్విమ్స్ కి టిటిడి నుండి సంపూర్ణ సహకారం అందిస్తున్నామని, సంవత్సరానికి రూ. 60 కోట్ల గ్రాంట్ తో పాటు ఎంప్లాయ్ హెల్క్ స్కీం, ప్రాణదాన ట్రస్ట్ , వివిధ రకాల ట్రస్ట్ ల ద్వారా సుమారు రూ. 100 కోట్లుకు పైగా సపోర్ట్ చేస్తున్నామని అన్నారు. స్విమ్స్ అనేది పేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు స్థాపించబడిందని, సంవత్సరానికి 18,000 సర్జనీలు, దాదాపు 4. 50 లక్షలుకు పైగా ఔట్ పేసెంట్లు, 47 వేల ఇన్ పేసెంట్లు వైద్య సేవలు పొందుతున్నారని, ఇందులో పేదలే అత్యధికంగా ఉన్నారని తెలిపారు. స్విమ్స్ లో భవిష్యత్ తరాలకు సరిపడేలా ప్లాన్ ప్రకారం నూతన భవనాల నిర్మాణాలు జరుగుతున్నాయని, అంకాలజీ , చిన్న పిల్లల హెల్త్ కోసం నిర్మాణాలు జరుగుతున్నాయన్నారు, అంకాలజీని లెవన్ వన్ సెక్టార్ గా తీసుకెళ్లేందుకు , స్విమ్స్ లో ఫ్యాకల్టీ సమస్య, మానవ వనరులు, మౌళిక సదుపాయాల కల్పన, నిర్మాణాలు, నిధుల సమీకరణ, స్వచ్ఛంగా వచ్చే నిపుణులైన వైద్యుల సేవలు తదితర అంశాలు, సమస్యల పరిష్కారం కేసం ఎక్స్ ఫర్ట్ కమిటీ వేశారని, ఈ కమిటీ ఇచ్చిన నివేదికపై జనరల్ కౌన్సిల్ చర్చించామన్నారు.

ఈ కార్యక్రమంలో ఎక్స్ ఫర్ట్ కమిటీ ఛైర్మన్ డా.ఐ.వి.సుబ్బారావు, సభ్యులు డా. జెఎస్ఎన్ మూర్తి, తేజోమూర్తుల రామోజీ, డా. చెన్నంశెట్టి విజయ్ కుమార్, స్విమ్స్ డైరెక్టర్ డా. ఆర్వీ కుమార్, టిటిడి బోర్డు మెంబర్ ఎన్. సదాశివరావు, జేఈవో వి. వీరబ్రహ్మాం, సీఈ సత్యనారాయణ హాజరుకాగా వర్చువల్ గా హెల్త్ స్పెషల్ సిఎస్ ఎం.టి. కృష్ణబాబు, టిటిడి బోర్డు మెంబర్ శ్రీమతి సుచిత్రా ఎల్లా, ఎండోమెంట్ సెక్రటరీ వినయ్ చంద్ తదితరులు హాజరయ్యారు.

# నసనకోట దుర్గమాంబ

# జాతర మహోత్సవాలు వైభవంగా ప్రారంభం







40లక్షలతో నిర్మించిన పలు కట్టడాలను ప్రారంభించిన ఎమ్మెల్యే పరిటాల సునీత, శ్రీరామ్

దుర్గమ్మ, ముత్యాలమ్మ అమ్మవార్ల ఊరేగింపు

హరియానచెరువు నుంచి పాల కావడి ఊరేగింపు

నసనకోటలో అంతటా ఆధ్యాత్మిక వాతావరణం

**అంకుశం న్యూస్ అనంతపురం మే 14:** రాప్తాడు నియోజకవర్గంలోని నసనకోట దుర్గామాంబ జాతర మహోత్సవాలు 70 సంవత్సరాలు తర్వాత వైభవంగా ప్రారంభించేందుకు పరిటాల కుటుంబం విశేషంగా కృషి చేసింది గ్రామాల ప్రజలతో సమావేశాలు నిర్వహిస్తూ అందరినీ ఒక తాటిపైకి తీసుకొచ్చి దుర్గ మాంబ జాతర ఘనంగా నిర్వహించాలని గత రెండు నాలుగు నెలలుగా పరిటాల సునీత పరిటాల శ్రీరామ్ దగ్గరుండి ఏర్పాట్లను పర్యవేక్షించి అద్భుతంగా తయారు చేశారురామగిరి మండలం నసనకోటలో దుర్గమాంబ జాతర మహోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. దేవస్థానం వద్ద 40 లక్షల రూపాయల నిధులతో నిర్మించిన ప్రొటెక్షన్ వాల్ రైలింగ్ అదనపు సౌకర్యాలు నాగలకట్ట నిర్మాణాలను ఎమ్మెల్యే పరిటాల సునీత, పరిటాల శ్రీరామ్ ప్రారంభించారు. చాలా ఏళ్ల తర్వాత జాతర మహోత్సవం నిర్వహిస్తుండటంతో నసనకోటతోపాటు చుట్టుపక్కల గ్రామాల్లో ఒక ఆధ్యాత్మిక వాతావరణం కనిపిస్తోంది. తొలి రోజు కార్యక్రమంలో భాగంగా దుర్గమ్మ, ముత్యాలమ్మ అమ్మవార్ల ఊరేగింపు వైభవంగా సాగింది. హరియాన్ చెరువు గ్రామం నుంచి పాల కావిడి ఊరేగింపు కూడా భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శ్రీ అభయాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాలలో భాగంగా స్వామివారికి జలధివాసము కార్యక్రమాన్ని నిర్వహించారు. మూడు రోజుల తర్వాత విగ్రహాన్ని పునఃప్రతిష్టించనున్నట్లు అర్చకులు తెలిపారు. అఖండ దీపారాధన, సభావందనము, గోపూజ, గంగపూజ, గణపతి పూజ, స్వస్తిపుణ్యాహావాచనము, శ్రీ అభయాంజనేయ స్వామికి జలాధివాసము వంటి కార్యక్రమాలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. సాయంకాల వేదపారాయణము, శ్రీ లలితా సహస్ర పారాయణం వంటి కార్యక్రమాలు నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమంలో ఎమ్మెల్యే పరిటాల సునీత మరియు శ్రీరామ్, సిద్దార్థ దంపతులతో పాటు పంచాయతీ పెద్దలు, ప్రజలు పెద్దఎత్తున పాల్గొన్నారు. నసనకోట గ్రామంలో చాలా ఏళ్ల తర్వాత ఈ ఉత్సవాలు జరుగుతుండటం చాలా సంతోషంగా ఉందని, ఐదు రోజులపాటు జరిగే ఉత్సవాల్లో భక్తులందరూ పాల్గొనాలని శ్రీరామ్, సునీత విజ్ఞప్తి చేశారు. ఉత్సవాలకు సంబంధించిన ఏర్పాట్లన్నీ వారు దగ్గరుండి పర్యవేక్షించారు..

## అనుకోని విపత్తు సంభవిస్తే..

# ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలి





– : జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి,

– : నగరంలోని రాజహంస అపార్ట్మెంట్ లో ప్రభుత్వ శాఖల మాక్ డ్రిల్..

**అంకుశం న్యూస్ అనంతపురం, మే 14 :** అనుకోని విపత్తు సంభవిస్తే.. ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్. పిలుపునిచ్చారు. బుధవారం అనంతపురం నగరంలోని ఆర్టీసీ బస్టాండ్ దగ్గరలో ఉన్న రాజహంస అపార్ట్మెంట్ లో జిల్లా ఫైర్ శాఖ, ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో మాక్ డ్రిల్ నిర్వహించారు.

– ఈ సందర్భంగా పాత్రికేయులతో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ నగరంలోని రాజహంస అపార్ట్మెంట్ లో మాక్ డ్రిల్ నిర్వహించడం జరిగిందన్నారు. అపార్ట్మెంట్లో 77 కుటుంబాలు ఉంటే 400 నుంచి 500 దాకా జనాభా ఉంటుందని, ఇలాంటి స్థలాల్లో మానవ నష్టాలు ఉండే అవకాశాలుంటాయని, అప్పుడు బాంబు పేలితే, ఆ భవనం కూలిపోతే ఏం చేయాలి, సైరన్ మోగినప్పటి నుంచి చివరికి వారు రెస్క్యూ చేసి హాస్పిటల్ కి చేర్చేదాకా వివిధ రకాల డ్రిల్స్ ని మొదట అధికారులు చూపించడం జరిగిందన్నారు. వినూత్నమైన పరికరాల గురించి వివరించడం జరిగిందని పేర్కొన్నారు. అధికారులు కూడా డ్రిల్ గురించి నేర్చుకున్నారన్నారు. తరువాత ఇక్కడున్న పౌరులచేత రెస్క్యూ చేయించడం జరిగిందని తెలిపారు.

– అంతకుముందు అకస్మాత్తుగా ఏదైనా విపత్తు సంభవిస్తే...విపత్కర, సంక్షోభ పరిస్థితులు ఎదురైతే....యుద్ధం వల్ల బాంబులు పడి లేదా గ్యాస్ లీక్, షార్ట్ సర్క్యూట్ బాంబులు, ఇతర ప్రేలుడు పదార్థాలను నిర్వీర్యం చేసే విధానాన్ని కూడా వివరించారు. రెవెన్యూ, పోలీసు, అగ్నిమాపక, వైద్యారోగ్య శాఖ, ఎస్డిఆర్ఎఫ్, ఎన్డిఆర్ఎఫ్, తదితర శాఖలు ఈ విన్యాసాల్లో భాగస్వాములు అయ్యాయి. పై అంతస్థులో అగ్ని ప్రమాదం జరిగినప్పుడు అక్కడికి అగ్నిమాపక సిబ్బంది చేరుకోవడం, క్షతగాత్రులను అక్కడినుంచి క్రిందకి దించడం, వారికి వైద్య సహాయాన్ని అందించడం, హుటాహుటిన ఆసుపత్రికి తరలించడం, అగ్నిమాపక, పోలీసు, రెవెన్యూ సిబ్బందికి ఎస్డిఆర్ఎఫ్ సిబ్బంది సహాయ పడటం, అప్పటికీ పరిస్థితి అదుపులోనికి రాని పక్షంలో ఎన్డిఆర్ఎఫ్ దళాలు జత కలవడం, ప్రజల ప్రాణాలను రక్షించి, సహాయ చర్యలు చేపట్టడం తదితర అంశాలను ప్రత్యక్షంగా చేసి చూపించారు. ప్రకృతి వైపరీత్యాలతోపాటు, మానవ ప్రేరేపిత ప్రమాదాలను సైతం ఎదుర్కొనే విధానాన్ని వివరించి, అధికారులు తమ సన్నద్ధతను తెలియజేశారు. ఈ సందర్భంగా మాక్ డ్రిల్ పట్ల పిల్లలు, యువకులకి అవగాహన రావాలని క్విజ్ పోటీలను నిర్వహించి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను అందజేశారు.

– ఈ కార్యక్రమంలో డిఆర్ఓ ఏ.మాలోల, జిల్లా ఫైర్ అధికారి శ్రీనివాసరెడ్డి, ఆర్డీఓ కేశవనాయుడు, డిఎంహెచ్ఓ డా.ఈబి.దేవి, కలెక్టరేట్ కోఆర్డినేషన్ సెక్షన్ సూపరింటెండెంట్ యుగేశ్వరి దేవి, తహసీల్దార్ హరిప్రసాద్, ఎస్డిఆర్ఎఫ్, జిల్లా ఫైర్ సిబ్బంది, వైద్య శాఖ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## గ్రామ దేవతశ్రీ సత్తెమ్మ తల్లిని దర్శించుకున్న ఎమ్మెల్యే నల్లమిల్లి కుటుంబ సభ్యులు



**కాకినాడ జిల్లా అంకుశం న్యూస్ రిపోర్టర్ మే 14:** పెదపూడి మండలం గొల్లల మామిడాడలో శ్రీ సత్తెమ్మ తల్లి అమ్మ వారి ఆలయం 5వ వార్షికోత్సవం సందర్భంగా అమ్మ వారిని దర్శించుకున్న వారిలో అనపర్తి శాసనసభ్యులు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి మహాలక్ష్మి దంపతులు, యువ నాయకులు నల్లమిల్లి మనోజ్ రెడ్డి సుమేఘ దంపతులు, డాక్టర్ నల్లమిల్లి సనాతని ఉన్నారు. ఈ కార్యక్రమం లో పెదపూడి మండల, గొల్లల మామిడాడ గ్రామ కూటమి నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

## శ్రీ గోగులమ్మ సన్నిధి లో కార్యకర్త జ చెల్లించిన ఎమ్మెల్యే నల్లమిల్లి



**కాకినాడ జిల్లా అంకుశం న్యూస్ రిపోర్టర్ మే 14:** పెదపూడి మండలం గొల్లల మామిడాడలో శ్రీ గోగులమ్మ అమ్మ వారి దేవస్థానంలో అనపర్తి శాసనసభ్యులుగా నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ఘన విజయం సాధించడంతో తెలుగుదేశం పార్టీ నాయకులు ద్వారంపూడి గోపికృష్ణారెడ్డి (గోపి) విందు ఏర్పాటు చేస్తామని మొక్కు మొక్కుకున్నారు. తెలుగుదేశం పార్టీ నాయకులు ద్వారంపూడి గోపికృష్ణారెడ్డి విందు ఏర్పాటు చేసి మొక్కుకున్న మొక్కును చెల్లించుకోవడం జరిగింది. ఈ సందర్భంగా శ్రీ గోగులమ్మ అమ్మ వారిని దర్శించుకుని మొక్కుబడి చెల్లించుకోనాకి వచ్చిన వారిలో అనపర్తి శాసనసభ్యులు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి మహాలక్ష్మి దంపతులు,యువ నాయకులు నల్లమిల్లి మనోజ్ రెడ్డి సుమేఘ దంపతులు, డాక్టర్ నల్లమిల్లి సనాతని పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పెదపూడి మండల,మామిడాడ గ్రామ కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గోన్నారు.

## పర్యావరణ పరిరక్షణ పై రైతులకు ప్రభుత్వం అవగాహన కల్పించాలి





**కోనసీమ జిల్లా అంకుశం న్యూస్ రిపోర్టర్ మే 14:** పర్యావరణానికి ఇబ్బందులు కలిగే విధంగా పంట పొలాలకు నిప్పు అంటిస్తున్న వారిపై అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా బీజేపీ ఉపాధ్యక్షులు కోన సత్యనారాయణ అన్నారు. ఇటీవల ఒకరిని చూసి మరొకరు వరుసగా పంట పొలాలకు నిప్పు పెడుతున్నారన్నారు. దీని కారణంగా ప్రయాణీకులు కళ్ళల్లోకి పొగ చేరి ఇబ్బందులు పడటంతో పాటు ఉష్ణోగ్రతలు సైతం పెరిగిపోతున్నాయన్నారు. మరోవైపు భూసారం కూడా తగ్గిపోతుందన్నారు. పంట పొలాలకు మేలు కీటకాలు మృతి చెందుతాయన్నారు. ఈ సమస్యలు పట్ల రైతులకు అవగాహన కల్పించడంతో పాటు ఇటువంటి చర్యలకు పాల్పడకుండా పోలీస్, రెవిన్యూ అధికారులు శాఖాపరమైన చర్యలు చేపట్టాలని ఆయన కోరారు.

## అనపర్తి మండలంలో పలు కుటుంబాలను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే సత్తి దంపతులు



**తూర్పుగోదావరి జిల్లా అంకుశం న్యూస్ రిపోర్టర్ మే 14:** అనపర్తి మండలం కొత్తూరు గ్రామానికి చెందిన సబ్బెళ్ళ వెంకటరెడ్డి బ్రెయిన్ క్యాన్సర్ తో బాధపడుతున్నారు. వారిని వారి కుటుంబ సభ్యులను, చింతా సుబ్బారెడ్డి కాలు ఫ్రాక్చర్ అయింది. వారిని వారి కుటుంబ సభ్యులను, ఇదే గ్రామానికి చెందిన ఓగిరెడ్డి రామారెడ్డి కాలికి ఆపరేషన్ జరిగింది. వారిని వారి కుటుంబ సభ్యులను పరామర్శించిన అనపర్తి నియోజకవర్గ వైయస్ఆర్సీపీ సమన్వయకర్త , మాజీ శాసనసభ్యులు డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డి, ఆదిలక్ష్మి దంపతులు. వారితో పాటు సత్తి గంగిరెడ్డి , సబ్బెళ్ళ సత్యనారాయణ రెడ్డి ,సత్తి రామారెడ్డి, చింతా వీర్రాఘవరెడ్డి , చింతా రామకృష్ణారెడ్డి , నల్లమిల్లి వెంకటరెడ్డి (వార్డు సభ్యులు) తదితరులు వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ (వైయస్ఆర్సీపీ) నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఘనంగా శ్రీ అయ్యప్ప స్వామి వారి ఆలయ ప్రారంభోత్సవం !



**అంకుశం న్యూస్ ధర్మవరం, మే 14:** ధర్మవరం పట్టణంలోని కేశవ నగర్‌లో భక్తిశ్రద్ధలతో, విశేషమైన భౌతిక నిర్మాణ శైలి తో ప్రతిష్టాత్మకంగా నిర్మించబడిన శ్రీ అయ్యప్ప స్వామి వారి దేవాలయం బుధవారం ఘనంగా ప్రారంభించబడింది. అనేకమంది భక్తులు మరియు స్థానిక ప్రజలు ఈ పవిత్ర కార్యక్రమంలో పాల్గొని స్వామివారి దివ్య దర్శనాన్ని పొందారు. ఆలయ కమిటీ వారి ఆహ్వాన మేరకు మంత్రి నియోజకవర్గ ఇన్చార్జ్ హరీష్ బాబు ముఖ్యఅతిథిగా హాజరై, అయ్యప్ప స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ వేదపండితుల ఆధ్వర్యంలో హోమాలు, అభిషేకాలు, అర్చనలు ఎంతో భక్తిశ్రద్ధలతో జరిగాయి. ఈ సందర్భంగా హరీష్ బాబు మాట్లాడుతూ, ఈ దేవాలయం ధర్మవరం వాసులకు ఆధ్యాత్మికశాంతి, సామూహిక ఐక్యతకు కేంద్రబిందువుగా నిలవాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షిస్తున్నాను. ఇటువంటి పవిత్ర ఆలయ నిర్మాణానికి శ్రమించిన అందరికీ హృదయపూర్వక అభినందనలు తెలియజేస్తున్నాను అని అన్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమం కూడా నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, పురోహితులు, మంత్రి కార్యాలయ సిబ్బంది, , స్థానిక నాయకులు, ప్రజలు, బిజెపి నాయకులు డోలా రాజారెడ్డి, బిల్లే శ్రీనివాసులు, జూటూర్ వెంకటేష్, పోతుకుంట రాజు, తదితరులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు.